# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮. | కాకినాడ:—శనివారము, ౧౯, మార్చి, ౧౯౨౧. (19 1921) | చందా సం॥ రు. ౩

సంచిక ౧౪. | విడిసంచిక అ ౧.

## ఓమ్.

భగవాన్! నీతో మేము సరిపెట్టుకోనజాలక గిలగిల తన్నుకొనుచున్నాము. నీ చర్యలు పరిపరివిధములై పరగుచున్నవి. మమ్ము సర్వదా సంతోషపడనియ్యవు; సర్వదా దుఃఖపడనియ్యవు; అటు కుంగిపోనియ్యవు; ఇటు ఉప్పొంగనియ్యవు. ధనసంతానాదుల ప్రసాదించితివిగదా యని సంతోషతరంగములపై ఉయ్యాల లూగునపుడు ఒక్క దెబ్బగొట్టి మా యుల్లాసమునంతయు విచ్ఛిన్నము చేయుచున్నావు. నీకు మాపై మక్కువ లేదని తలంచి ముకుళితహృదయులమై జీవయాత్రచేయునపుడు ఎదురుచూడని యేదో లాభమును గూర్చి మమ్ము తిరిగి హృష్టాంతరంగుల జేయుచున్నావు. నీవు కలిగించెడు ఈ మోదఖేదముల రహస్యమును మాకు బోధచేయుము. ఒక్కరీతిని ప్రసన్నచిత్తులమై నిన్ను కొలిచెడు భాగ్యమును మాకు అనుగ్రహింపుము.

---

స్వామీ! ముక్తిబొందుటకు ఏమి చేయవలెను.

భగవంతుని నీపూర్ణ హృదయముతోడను, పూర్ణమనస్సుతోడను, పూర్ణాత్మతోడను, పూర్ణశక్తితోడను, ప్రేమించుట మొదటి విధి. రెండవది, నీవు నిన్నువలె ఇతరులను ప్రేమించుట.

(జీసస్ క్రైస్టు.)

---

## విశ్వాసి.

——:o:——

జార్జిమూలరు పరమవిశ్వాసి, విశ్వాసపూర్వకములగు ప్రార్థనలచే అనేక మహత్కార్యముల గావించిన మహాభక్తుడితడు. ఈమహానుభావుని అసాధారణ విశ్వాసము జనులను స్తంభితుల జేయుచుండెను. అలౌకిక సామాన్యమగు తన విశ్వాసమునకు గల హేతువుల నాతడిట్లు తెల్పెను.

౧. సమస్తజనులును మోక్షముబడయుట భగవదిచ్ఛయగుటచే పరుల మోక్షమునకై నేను చేసెడు ప్రార్థనలను అతడు నిరాకరింపజాలడు.

౨. నేను యోగ్యుడను గనుక వారికి మోక్షము నియ్యవలెనని నేను ప్రార్థించి యుండలేదు. పరమయోగ్యుడగు ప్రభువుపేర వారి మోక్షమునకై నేను ప్రార్థించియుంటిని.

౩. నా ప్రార్థనలను ఫలింపజేయుటకు భగవంతునికి శక్తియు, ఇచ్ఛయు గలదని నేను సర్వదా నమ్మియుంటిని.

౪. పాపమునకు నాహృదయము తావొసంగినచో భగవంతుడు నా ప్రార్థనను ఆలకింపడు గాన ఎరిగి నేను ఎట్టిపాపమును చేయలేదు.

౫. నేను ౫౨ సంవత్సరములనుండి నా ప్రార్థనలయందు విశ్వాసముంచి జీవించియుంటిని. ప్రత్యుత్తరము వచ్చేవరకు నేను అట్లే చేయుదును.

---

# శ్రీమతి రుక్మిణి అమ్మాళ్.

———०:०:०———

ఈ కాంతాశిరోమణి కేరళదేశమందలి కేసరగోడు గ్రామమున ౧౮౬౬ సంవత్సరమున జననమొందెను. యీమె అసాధారణమైన సుగుణసంపన్నురాలు. సాహసౌదార్యములును, వినయవిశ్వాసములును ఈవనితారత్నమునందు గుమిగూడియుండెను. సుప్రసిద్ధ సంఘసంస్కర్తలగు .కె. రంగారావుగారు ఈమగువయొక్క భర్త. వీరు తలపెట్టిన సకల సత్కార్యములందును రుక్మిణీ అమ్మాళు చేదోడు వాదోడైయుండెను. ఎనిమిది సంవత్సరముల పసితనముననే ఈమెకు వివాహమయ్యెను. రంగారావుగారి తండ్రి డిస్ట్రిక్టు మునసబుకోర్టులో పెద్దగుమాస్తా. విశేష స్థితిమంతుడు గాడు. ఈయన త్వరలోనే స్వర్గస్థుడయ్యెను. అందుచే సంసారభారమంతయు ప్రథమపుత్రుడగు రంగారావుగారి మీదనే పడియెను. ఉపాధ్యాయోద్యోగమునందు కుదిరి అత్యంతప్రయాసతో వీరు సంసారశకటమును నడుపుచుండిరి. దారిద్ర్యబాధ మిక్కుటముగానుండెను. స్వదేశమునందు తగినంత రాబడి లేకపోవుటచే ఏదైన మంచి యుద్యోగమును సంపాదించుటకై రంగారావుగారు బొంబాయినగరము పోవ నిశ్చయించుకొనిరి. కాని యీ ఆలోచన రుక్మిణి అమ్మాళునకు సమ్మతముగా లేదయ్యెను. కాని ఉపాయాంతరమేమి? స్వస్థలము అన్నము పెట్టదు గదా. ఆమె ఒక్క యేర్పాటు చేసెను. భర్తను న్యాయవాది వృత్తికై ప్రయత్నింప పురికొల్పెను. ఆయన న్యాయవాదియగులోగా తన ఆభరణములను ఒక్కటొక్కటిగా అమ్మజేసి, తమకు సామాన్యముగా వచ్చు ఆదాయమునకు దానిని గూడ జేర్చి కుటుంబమును గడపనోడంగెను. ఆమె సంకల్పానుసారము శీఘ్రకాలములోనే రంగారావుగారు న్యాయవాదులైరి. పేదతికము తీఱిపోయెను. ఆదాయము అధికము కాజొచ్చెను. కాని ధనము కూడుచున్నది గదాయని నగలమేని నిండ దిగవేసికొని కడుపులోని చల్ల ఇదలకుండ కూరుచుండి ముచ్చటలతో హాయిగా కాలము గడపవలయునని ఆమె అభిలషింపలేదు. తన భర్త చేబూనిన సకల ధర్మకార్యములందును ఉత్సాహపూర్వకముగా ఆసాధ్వీలలామ తోడ్పడుచుండెను.

రంగారావుగారు జాతిభేదములు అక్రమములు, అరిష్టదాయకములని నమ్మెడు ఉదారహృదయులు. వారి యీ నిశ్చితాభిప్రాయమును కార్యమునందు పెట్టుటకు ఒక తరుణము తటస్థమయ్యెను. కీర్తిశేషులైన చంద్రశేఖర మొదల్యారుగారు వారి ప్రియస్నేహితులు. వీరు ౧౮౭౪ సంవత్సరమునందు మంగుళూరులో అసిస్టెంటు సర్జనుగా పనిచేయుచుండిరి. ఈ ప్రాణమిత్రుని గౌరవార్థమై రంగారావుగారు ఒక విందు గావించిరి. ఎట్టి భేదములను పాలింపక తమ సుహృదుల నెల్ల వారు ఈవిందునకు ఆహ్వానముచేసిరి. ఆపురములో ఇదియె అట్టి మొదటి విందు. ఈకార్యము నాడు సంఘములో నెట్టి కలవరమును కలిగించియుండునో చెప్పనావశ్యకములేదు. రుక్మిణి అమ్మాళు ఈవిషయమునందు సంపూర్ణమైన సానుభూతిని గల్గియుండెను.

వర్ణభేద విషయముననే గాక స్త్రీల ఉన్నత విద్యావిషయముననుఆవనితారత్నము ఉదారాభిప్రాయములనే కల్గియుండెను. స్త్రీవిద్యకు తగిన సౌకర్యములు లేని యీకాలమునందు బాలికలకు ఉన్నతమైన విద్య చెప్పించుట ఎంత ప్రయాసకరమో ఎల్లరును ఎఱిగియేయున్నారు. అయినను కష్టములకెల్ల నోర్చి ఆమె తన కుమార్తెలకు సద్విద్యను చెప్పించియుండెను. పెద్ద కొమార్తెయగు లలితాబాయియు రెండవ ఆమెయగు రాధాబాయియు మంగుళూరునందలి ఒక బాలికాపాఠశాలలో విద్యను గఱచుచుండిరి. యీవిద్యాలయమునకును గృహమునకును చాల దూరముండెను. పిల్లలకు మధ్యాహ్న భోజనమును తీసికొని వెళ్లుటకు బ్రాహ్మణులు లభింపకుండిరి. కాని అంతమాత్రమున ఆమె బాలికల విద్యను మాన్పింపలేదు. జనులచే నింద్యముగా చూడబడెడు కడమజాతి సేవకునిచేతనే కుమార్తెలకు భోజనమును పంపించుచువచ్చెను. కుమార్తెలిర్వురు ఎఫ్. ఏ. పరీక్షలో కృతార్థత చెందిన తరువాత రెండవ పుత్రికను చెన్నపురికి స్వయముగా తీసికొనివెళ్లి భోజనాది సదుపాయము లెల్ల సమకూర్చి చెన్నపురిరాజధాని కళాశాలలో ప్రవేశపెట్టించివచ్చెను. ౧౯౦౦ సం||లో ప్రథమశాస్త్ర పరీక్షలో (F. A.) జయమొందిన హిందూబాలిక లిర్వురును రుక్మిణి అమ్మాళు కుమార్తెలే. సంఘసంస్కారమునందు యీమెకు గల అభిమానాతిశయము చేతనే వారి గృహమున రెండు అంతర్జాతీయ వివాహములును రెండు వితంతుద్వాహములును జరిగియుండెను.

పంచమ జాత్యభివృద్ధికై చేసిన మహోత్కృష్టసేవచే రంగారావుగారు సమస్త హిందూదేశమునందు పేరువడసియున్నారు. మంగుళూరునందు ౧౮౯౭ సంవత్సరమున నిమ్నజాత్యభివృద్ధికై మొట్టమొదట సంఘమేర్పాటుచేయబడెను. నాటనుండి రంగరావుగారు అంటరానితనమును పాటింపక పంచములతో కలిసి మెలగజొచ్చిరి. అందువలన సాంఘికులచే వీరు గూడ పంచములుగా జూడబడుచుండిరి. మాలమాదిగెలని వారిని హేళనము చేయుచుండిరి. కాని యిట్టి పరియాచకములకు తాగూడ గుఱియైనదయ్యును ఇంచుకేనియు రుక్మిణి అమ్మాళు మనస్సున నొచ్చుకొనలేదు. అజ్ఞానముచే వారట్లు తూలనాడిరని నవ్వుచుండెను. ఇట్టి హేళనముల సహించుటయే గాక శరీరక్లేశము గూడ ఆసాధ్వీమణి యెంతయో అనుభవింపవలసి వచ్చెను. అస్పృశ్యులతో గలిసి మెలసియున్నారన్న హేతువుచే వంటవాడు వారియింట పని మానివేసెను. నౌకరులు పనిని చాలించుకొనిరి. తుదకు చాకలి గూడ గుడ్డలు ఉదుకడయ్యెను. యీపనులన్నియు రుక్మిణి అమ్మాళుపై బడియెను. ఇన్నిపనులను తాజూచుకొనుచు ఇంటిలోని పిల్లలకును పెద్దలకును నెట్టి సౌఖ్యలోపము కలుగకుండ ఆయిల్లాలు కనిపెట్టియుండెను. అంతియే గాక మంగుళూరునందు ఒక సేవాసదనమును స్థాపింపనెంచి తన నదినె గారిని వెంటబెట్టుకొని భర్తతో గలిసి బొంబాయి నగరమున కరిగెను. స్ఫుటముగా నల్వురకు తెలిసిన పై సత్కార్యములనే గాక ఆమె యెన్నియో విధముల ప్రజాశ్రేయస్సు కొఱకు పాటుబడుచుండెను. వాని నన్నిటిని లెక్కించుట అసాధ్యము.

ఇన్ని కడగండ్లను అనుభవించినదైనను దేశస్థితి కొంత పలుపు మాఱుచుండగా జూచెడు భాగ్యము కలిగినందులకు ఆమె తన అంత్యదినముల నొక్కింత సంతోషమును బడయుచుండెను. పంచము

లను బాగుచేయుటకై తాను పూనుకొన్నపుడు నల్వురు గేలిచేసిన ను ఇప్పుడు బ్రాహ్మణబాలికలకు భోజనము తీసికొనిపోవుటకు బ్రాహ్మణేతరులే గాక క్రైస్తవులు గూడ సేవకులుగా ఉపయోగింపబడసాగిరి. తన బాలికలు విద్య నభ్యసించునపుడు జనులు హేళనముచేసిరి. గాని యిపుడు స్త్రీవిద్య సర్వసామాన్యమైనది. రుక్మిణి అమ్మాళు తన రెండవ కొమార్తెను బ్రాహ్మణేతరులగు కుమార మంగలం జమీందారుగారి కిచ్చి వివాహముచేసెను. ఇందుకై తోడివారు ఎన్నెన్నివిధముల ఆమెకు పోడిచియుందురో కాని రుక్మిణి అమ్మాళు తా గావించిన సమస్త కార్యములందును ధర్మమును దైవమునే ప్రధానముగా జూచెను గాని ప్రజల దూషణభూషణములను పాటింపలేదు. ఉదార స్వభావులగు రంగారావుగారు సలిపిన సకల సంస్కార ప్రయత్నములందును ఈసాధ్వీతిలకము సోత్సాహముతో సాయపడియెను. సహధర్మచారిణియన్న నామము ఈ కాంతారత్నము పట్టున సార్థకమై వరగుచున్నది.

పా. న.

---

# మద్యపానము.

[ శ్రీ కంజమూరి రంగాచార్యులు ఎం. ఏ; బి. ఎల్. గారి వ్యాసములోని భాగము.]

మద్యసార మాహార మెంత మాత్రమును కాదు. అది విషవస్తువుల తరగతిలోనిది. రక్తమును జెరచును; మెదడును బాడుచేయును; నరముల పటుత్వమును బోగొట్టును; ఊపిరితిత్తులను దినివేయును; అన్నకోశమునకు బాధను కలిగించును; ఆకలినిచంపును; దృష్టిని మందగింపజేయును; ఆయుస్సును క్షీణింపజేయును; దేహారోగ్యమును పూర్ణముగా నాశన మొనర్చును. వేడుక కయి విత్తమిచ్చి యపమృత్యువును గొనితెచ్చుకొనుట యేమి వివేకము? పశుపక్ష్యాదులు సహితము దయాసముద్రుడైన భగవంతుడు పానీయములుగా బ్రసాదించిన నీరక్షీరములను మాత్రమే త్రాగుచుండగా, మనుష్యుడు మద్యపానముచేయుట పశుపక్ష్యాదులకంటె హీనుడగుట కాదా?

ఇల్లును ఒళ్ళునుగూడ నొక్కసారిగా గుల్లచేయుటయే కాక మద్యపానము మానవుని నైతికజ్ఞానశక్తులను గూడ క్షీణింపజేయును. మన దేశములో జరుగుచుండు నేరములలో ముప్పాతికభాగము మద్యపానరతులవలననే జరుగుచున్నవని నిశ్చయముగా జెప్పవచ్చును. జారులలో జోరులలో జూదరులలో మద్యపానమును జేయనివా రెవ్వరుందురు?

మద్యపానమువలన జురుకుదనము కలుగునని కొందరును, దినమంతయు గష్టించి యలసిసొలసియుండు పాటకపుజనుల కిది యవసరమని కొందరును జెప్పవత్తురు. కాని యీవాక్యములు విశ్వసనీయములు కావు.

విజ్ఞానవల్లరి.

---

# మాంసాహార పిశాచము.

సీ॥ వేర్వేరు రుచులచే వంతుల గొలిపెడు పలురకంబుల మంచి పండులుండ | దలచిన నోరూరు దాలింపులకు జాలు గణనకుమీరు శాకంబులుండ | దినమొక్కదినుసుగా దనియింపగల మేలు పలురకంబుల పిండి వంటలుండ | గర గర గరగిపో వనుగులు వడిమాలు గనుజవిగల యూరు గాయలుండ॥ గీ॥ పాలు పెరుగు సమృద్ధిగా బరగుచుండ | గనికరము మాని మాంసంబు దినమరిగిన | క్రూరమతికేల నీభక్తి గుదురు దేవ | సకల కల్యాణ గుణధన్య సర్వమాన్య॥

(సర్వమాన్య శతకము.)

సర్వదయామయుడగు సర్వేశ్వరుడు జీవకోటులనెల్ల సృష్టించి ఆయాజీవికి తగునాహారంబును గూడ సృజించియుండుట, తనువు ధరించియున్న ప్రతిజీవికి స్వభావసిద్ధముగా తెలిసియున్నది గదా! ఆసర్వేశ్వరుని సృష్టిలో మానవజన్మంబు సర్వోత్తమం బని, అన్నిమతములవారిచే అంగీకరింపబడిన విషయము సర్వజనులకు విదితమే గదా! అట్టి శ్రేష్ఠంబగు మానవజన్మం బెత్తి, స్వాభావికాహారమగు అన్నశాకపదార్థముల భుజించి, తృప్తిపొందక, రుచికొరకు ననేకవిధములను పకార మొనరించుచున్న, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు మొదలగు జంతువుల సంహరించి కృతఘ్నులై అస్వాభావికాహారమగు శవముల భక్షించుట జూడ, వివేచనగల మానవునికి విచారము గలుగక మానునా? ప్రస్తుతము మన సేనానాయకుండగు గాంధీమహాత్ముడు మన దేశమాతను బాధించుచున్న పిశాచములలో నొకటగు సురాపాన పిశాచమును సంహరించుటకు సంకల్పించి తన సేనను యుద్ధరంగమున దింపి, యుద్ధము చేయించుచున్నాడు, తానును చేయుచున్నాడు. ఈసమయముననే సురాపాన పిశాచ సోదరుండగు మాంసాహార పిశాచమును సహా బరిమార్చుట మిక్కిలి సులభము. సహోదరులారా, ప్రస్తుత ధర్మయుద్ధమున మన మందరమును పాల్గొని, మన విధికృత్యమని దలంచి నియ్యద్దరి పిశాచముల నీసమయముననే సంహారముచేసి దేశమాత నుద్ధరించి శాశ్వతసుఖముల బడయుదురని ప్రార్థించుచున్నాడను.

ధర్మమే జయమను నార్యోక్తిని సార్థకపరచుదుము గాక!

ఫలికల్లు, పి. వెంకటప్రియయ్య,

---

సత్యమేవజయతే

# ధర్మసాధని

శనివారము, ౧౯, మార్చి, ౧౯౨౧.

## చేతిపనులు నీచములా?

—:-:o:-:o:—

రాత్రింబగళ్లు రోకటిపాట పాడి పుస్తకములలోనున్న సంగతులన్నియు ముక్కున బెట్టుకొని పరీక్షలలో చీదివేసి యేలాగో బి. ఏ. యనియో ఎమ్. ఏ. అనియో అనిపించుకొని తాము మహా విద్వాంసులమనియె విర్రవీగుచు ఏ కచేరీలోనో ఆత్మగౌరవము చంపుకొని గుమస్తా పనిచేసి నాలుగుడబ్బులు సంపాదించుట ఘనముగా నెంచి చేతిపనులు తమ పరువునకు పనికిరావని త్రోసివేయు విచిత్రవిద్యావంతుల తెగ యొకటి మన దేశమున నేడు ప్రబలినది. వారు చదివిన చదువు మనోవికాసమునకు, నూతన పరిశోధనములకు, ధర్మజీవనమునకు, వినియోగపడుచున్నదా యని చూచిన, అది సున్న. కాని వారి మిడిమిడిజ్ఞానము బానిసవృత్తి శ్రేష్ఠమనియు, స్వతంత్రవ్యాపారము నికృష్టమనియు తలంచునట్లు చేయుటకు మాత్రము తోడ్పడుచున్నది. ఈ అద్భుతవిద్యాధికుల మూలమున, దేశములో ఏది నిజముగ నీచమో అదియె ఘనమని తలంచుబుద్ధి పెరుగుచున్నది. దేశము అసలు అజ్ఞానములో మునిగి యుక్తాయుక్తముల గ్రహించుశక్తినే గోల్పోయెను. మన యపూర్వ విద్వాంసుల బుట్ట తలపాగాలు, లాంగుకోటులు, షార్టుకోటులు, పంట్లాములు, హాట్లు, బూట్లు, గుర్రపుబళ్లు, బంట్రోతులు, కేకలు—ఈ హోడావుడి అంతయు చూచి సామాన్యజనులుకూడ తాముచేయు చేతిపనులన్నియు నీచములనియు, వారుచేయు నౌకరియె చాల ఘనమనియు తలపోయుచున్నారు. చేతిపనులమీద నిట్లు నిరసన యేర్పడుటవలన దేశమునందు స్వాతంత్ర్యవృత్తులు పెంపొందుటకు అవకాశము గాన్పింపదు. మన గుమాస్తాపండితులను, పామరజనులను జపాను దేశములో చేతిపనులు ఎంతగౌరవముతో చూడబడునో గమనింప గోరుచున్నాము.

కాంజార్ అను నతడు జపానుదేశములో నొక గొప్ప చిత్రకారుడు. చిత్రలేఖనమునందు ప్రఖ్యాతి గాంచినను, కుమ్మరముగూడ నేర్చి యందు బహునిపుణత సంపాదించెను. జపాన్ చక్రవర్తిని దర్శించుటకు తాను పనిచేయు సమయములలో వేసికొను మలినవస్త్రములతోనె వెళ్లువాడు. చక్రవర్తి అది చూచి మంచి విలువగల దుస్తులజత యొకటి ఆతనికి బహుమతిగా నొసంగెను. కాంజార్ అవి తొడుగుకొని మాసిపోవునేమొ అను యోచనయే లేక మట్టితో పనిచేయుచుండగా, ఆతనిదగ్గర పనినేర్చుకొనుచున్న యొకడు 'అయ్యా, అవి విలువయిన దుస్తులు. ప్రత్యేకసమయములందు మాత్రమె మీరు వానిని ధరింపవలెను.' అని ఇంకను ఏమేమొ చెప్పబోయెను. "కుండలుచేయుట నాకు అతిఘనమయిన పని. అవి చేయు సమయముకంటె నెక్కువముఖ్యమయిన సమయము వేరొండు లేదు." అని కాంజార్ బదులుచెప్పెను.

మన దేశమునందును పూర్వము యథార్థపండితులు సామాన్యవృత్తులు నీచములని యెంచక వానిననుసరించుచు గౌరవముతో జీవించుచుండిరని బమ్మెరపోతనాది మహాపురుషుల జీవనములవలన స్పష్టముగ తెలియగలదు.

"ఉ. బాలరసాల సాల నవ పల్లవ కోమల కావ్యకన్యకం
గూళల కిచ్చి యప్పడుపుఁ గూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతర సీమలఁ గందమూల కౌ
ద్దాలికులైన నేమి నిజదార సుతోదర పోషణార్థమై."

అని పోతనామాత్యుడు చెప్పిన పద్యరత్నమును తిరిగి యెల్లరు స్మరించి చేతిపనులలో ఏమియు నీచము లేదని గ్రహించి దేశమునందు స్వతంత్రజీవనము వృద్ధినొందింతురుగాక యని గోరుచున్నాము.

హిందూ న్యాయశాస్త్రము:—

హిందూ న్యాయశాస్త్రము అచారము ననుసరించి కాలానుగుణముగ మార్పు నొందవలసినది. పుస్తకరూపమున తయారుచేయబడి దొరతనమువారి న్యాయస్థానములందు వాడబడు హిందూ న్యాయశాస్త్రము కొంతకాలము క్రిందట అప్పటి యాచారము నుబట్టి నిశ్చయింపబడినది. అప్పటినుండి మనయభిప్రాయములలో నెన్నియో మార్పులు కలిగినవి; నూతనాచారములును వెలయుచున్నవి. వీనికి అనుగుణముగ నేటి హిందూ న్యాయశాస్త్రము సంస్కరింపబడవలయును. దొరతనమువారి మూలమున ఈపని కానేరదు. దేశప్రముఖులె జనుల పరిస్థితుల కనిపెట్టి వానికనుగుణములగు మార్పులు నిరూపింపవలయును. హైకోర్టుజడ్జి పదవియందు పనిచేసి యిటీవలనె విశ్రాంతిగైకొనిన టి. శేషగిరి అయ్యరుగారు దేశప్రముఖులతో సంప్రదించుచు హిందూ న్యాయశాస్త్రమునందు కొన్ని సవరణలు సూచింపదలపెట్టిరని తెలియుచున్నది. శ్లాఘనీయమగు వారిప్రయత్నమునకు దేశీయులు తోడ్పడుదురని నమ్ముచున్నాము.

నాన్కానా సాహెబ్ హత్యలు:—

గురునానక్ జన్మస్థానమగు నాన్కానా సాహెబ్ వద్ద గురుద్వార మందిరమున మహంతుచే గావింపబడిన హత్యలు మఠాధిపతుల నిరంకశత్వము ఎట్టి దౌర్జన్యములకు కారణము కాగలదో బోధపరచుచున్నవి. గురువులకు గౌరవము సహజముగ, హృదయపూర్వకముగ చూపబడునప్పుడె, వారియందు ధార్మికౌన్నత్యము గలదని అనుకొనవలసి యుండును. జనుల సన్మానమునకు పాత్రులుగాక వారిసొమ్ముతో నిర్మింపబడిన గుళ్ళను, గోపురములను, మందిరములను స్వాధీనము చేసికొని నిరంకుశముగ జనులను అందు జేరనీయకయు, ప్రవేశించిన వారిని వధించియు, ఘాతుక కార్యములు జరుపు మఠాధికారుల ప్రభుత్వము ఎంత త్వరితముగ అంతరింపజేసిన జనులు అంత త్వరితముగ ధర్మజీవనమున పెంపొందగలరు.

ఉత్కళ అనాథాశ్రమము:—

కలకత్తా సాధారణ బ్రాహ్మసమాజమువారు చిలకసరస్సు సమీప ప్రాంతములందు క్షామపీడితులకు సహాయ్యము చేయుటకు ఇప్పటికి అయిదుమాసముల నుండి పాటుపడుచు పదివేలరూప్యముల వెచ్చించిరి. సహాయ్యము బడసినవారు అనేకవేలుగలరు. అచ్చటి యేర్పాటులన్నియు సుధీరచంద్ర బెనర్జిగారి యాజమాన్యమున గావింపబడెను. మిక్కిలి పసివారు పండ్రెండుగురు మగపిల్లలు, ఆడుపిల్లలు ఎవరియాధారము లేక వారి యధీనమునకు వచ్చియుండుటచే, ఆపిల్లలనిమిత్తము కటకమునందు ఉత్కళ అనాథాశ్రమము నూతనముగ స్థాపింపబడినది. దిక్కులేనివారల నితరులను కూడ చేర్చుకొనుచు దానిని వృద్ధిచేయు ప్రయత్నములు జరగుచున్నవి బరంపురమునందు కొంతకాలము బ్రాహ్మమత ప్రచారకులుగ నుండిన మహేంద్ర పట్నాయక్కుగారును కార్యదర్శులలో నొకరుగానుండి ఆశ్రమాభివృద్ధికి పాటుపడుచున్నారు. దేశసేవ సల్పుచున్న ఆ శరణాలయ సేవకులను ఈశ్వరుడాశీర్వదించును గాక! వారి యుద్యమమునకు వలసిన సమస్త సహాయ్యమును చేకూర్చును గాక! ధనము పంపదలచినవారు కోశాధిపతి విశ్వనాథ కార్ గారికి పంప ప్రార్థితులు.

## సమాచారము.

జర్మనివారు యుద్ధపుఖర్చు లీయనందున, మిత్రమండలివారు డ్యూసెల్డార్ఫు నాక్రమించుకొనిరి. బ్రిటిషు గుర్రపు సిబ్బందియు, బెల్జియనుల పదాతులును, ఫ్రెంచివారి గుర్రపు సిబ్బందియు, పదాతులు, యింజనీరులు యుద్ధసామగ్రి మున్నగునవి యచటికి చేరెను. తిరిగి యుద్ధము ప్రారంభమయినది.

మహాత్మా గాంధిమున్నగు వారి రాకకు తగిన యేర్పాటులు బెజవాడలో చేయబడుచున్నవి. జాతీయ విద్యాపాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఈనెల ౩౧వ తేది గాని మరునాడుగాని బెజవాడలో కలసి మౌలానా మహమ్మదాలీగారు సంప్రదింతురు.

'సంపూర్ణ స్వాతంత్ర్యమున కంగీకరింపవలయును. మారాజును మే మేర్పరచుకొనెదము, బ్రిటిషు సైన్యములు వెడలిపోవలయును. పదేశీయోద్యోగులు తొలగిపోవలయును' అని మొదలుగాగల షరతులను ఈజిప్టువారు బ్రిటిషువారికి తెలియజేసిరి.

అమెరికా ప్రెసిడెంటు హార్డింజిగారు తమదేశ సెనెటుసభలో నుపన్యాసమొసంగుచు యునైటెడు స్టేట్సువారు దౌర్జన్యరహితముగ ప్రవర్తించుచుండెదరనియు, ఇతరదేశములవారితో బాటు నిరాయుధ సమస్యకు తోడ్పడెదరనియు, తెలిపిరి.

# పరమాత్మ-హిందూమత సిద్ధాంతము.

(పి. సి. మజుందారుగారు.)

## VIII

ఈశ్వరునియందు దాగియున్నట్టిదైన త్రిశక్తులచే సర్వసృష్టి ఉత్పత్తియగునని హిందూమతము నిరూపించుచున్నది. అందు మొదటి శక్తిచే తనంతట తాను అభిన్నముగా వెలుగొందుటయే గాక, తదితరములకు గూడ రూపములనిచ్చి ఈశ్వరుడు వెలయుచున్నాడు. రెండవ శక్తిచే తనంతట తాను జ్ఞానస్వరూపుడై, తాను సృజించిన విశ్వము నంతటను జ్ఞానమును వెదజల్లుచున్నాడు. మూడవశక్తిచే తాను సుందర, ప్రేమస్వరూపుడై వెలుగొందుచు సృష్టినంతను సౌందర్య ప్రేమలను నిలయముగా జేసెను. The first is Existance, the second is reason, third is joy. మొదటిది 'సత్యమ్', రెండవది 'జ్ఞానమ్', మూడవది 'సుందరమ్'. 'ఆనందమ్', 'బ్రహ్మన్', 'పరమాత్మన్', 'భగవాన్' అను నామము లివి ఆధ్యాత్మిక విధజనకమగు నవగుణ్యములు. ఎవ్వడు కాముడై, కామముగువానిని సృజించుచున్నాడో అట్టివాడే 'బ్రహ్మన్'. ఎవ్వాని అపరిమిత జ్ఞాన మీ మహావిశ్వము ఉద్ఘోషించుచున్నదో, ఎవ్వడు తాను సృజించిన ప్రతి చిన్న యణుకణువందును నివసించుచున్నాడో అట్టి అసామాన్య జ్ఞానస్వరూపుడే 'పరమాత్మన్'. ఎవ్వాని వలన నీ స్థావరజంగమ వస్తువులు ఉత్పత్తియైనవో, ఎవ్వనిని ఆశ్రయించి, ఎవ్వానివలన అవి అన్నియు రక్షితములైయున్నవో, సమస్త శక్తులు, సమస్త సాధకములు, సర్వ ప్రపంచములయొక్క సమస్త భాగ్యము లెవ్వానికి చెందియున్నవో, ఎవ్వడు ప్రతిమానవ హృదయమందు నిరంతరము నివసించుచు మహోన్నతలీలలు సల్పుచున్నాడో అట్టివాడే 'భగవానుడు.'

ప్రకృతి శాసనములందును, వస్తు సంచయములందును నీశ్వర ప్రత్యక్షమును నిరూపించినట్లుగా వేదములు వ్యక్తపరచుచున్నవి. జీవాత్మను గురించి మానవజ్ఞానమును గురించి ఉపనిషత్తులు విపులముగా వివరించినవి. మానవునితోడి ఈశ్వర సంబంధములు, ఈశ్వరావతారములు విపులముగ పురాణములందు వ్యక్తీకరింపబడినవి. సాధారణముగా జూచినయెడల హిందూక్రైస్తవమత గ్రంథములకు పోలికలు గలవు. వేదములు ప్రాత నిబంధనకును, వివిధ వార్తలు (Gospels) పురాణములతోను, సెయింటుపాలుని లేఖలను ఉపనిషత్తులకును పోల్చవచ్చును.

ఈబ్రహ్మాండములను నావరించియున్న వ్యాపించియున్న పరమాత్మను గాంచుట, ప్రకృతీశ్వర భావమును గ్రహించుటయే, నమ్మకము కల్గియుండుటయే. చిత్రవిచిత్రములగు చిన్నెలవన్నెలతో గన్నుల కింపొనర్చుచు నతి సౌందర్యరాశియగు సృష్టి భవ్యలను నావేశపూరితులుగను, సప్రమత్తులుగను జేయుచున్నది. ఇట్లు చేయుటయే గాక 'జీవితము మిగుల దుఃఖభాజనము, నీచకరమైనది' అను భావమును బూర్తిగా రూపుమాపుచేయును.

శ్లో॥ యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవాను పశ్యతి।
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే॥

అను రీతిగ నెవ్వడు పరబ్రహ్మమునందు సకల వస్తువులను, సర్వమందు పరబ్రహ్మమును గాంచెదరో అట్టివా రొకనియందును నింద మోపకపోవుటయే గాక తమ హృదయములందు గూడ నిత్యము ఈశ్వరుని గాంచగల్గుదురు. మనలో నీశ్వరు డున్నాడను గభీరభావ ముద్భవించరిదే ఈశ్వరుని బాహ్యమున గాంచలేము. అంతర్యామియగు సర్వేశ్వరునియందు నమ్మక ముండినయెడల ఆయనను సర్వత్ర చూచి తీరవలెను. ఇదివర కెన్నడు గాంచలేనప్పటికి ఆయన సందర్శనము మన ఆత్మలో అగాధమును, నిస్సందేహమగు, అనంతాభివృద్ధి కలవగు ఆధ్యాత్మిక ప్రపంచక విషయములకు మార్గము తెలుపవలెను. అట్లు చేయనిదే మన విశ్వాసము వట్టి వ్యర్థమగు కల్ల. జ్యోతులకెల్ల జ్యోతియై, తేజములకెల్ల తేజమై, పవిత్ర స్వరూపుడై మన హృదయాంతరాళములందు నివసించుచున్నాడీశ్వరుడు. ఎవ్వడు ఎప్పుడు పాప విమోచనకై, పశ్చాత్తప్త హృదయుండై, దీనుడై, ధ్యానపరుండై, యీశ్వరారాధనకు గడంగునో అట్టివాడు అట్టి సమయములందు ఆట్టీశ్వర తేజమును దనలో గాంచగల్గును. మానవునియందు యీశ్వరుడు నిత్యము నివసించుచున్నను మానవుడు యీశ్వరుని దెలిసికొనజాలకున్నాడు. ఏల? విషయవాంఛలచే తగుల్కొనబడుట చేత దుశ్చింతలకు దన హృన్మందిరమును బుట్టినిల్లుగ చేయుటచేత, అసత్యములకు పాపాఘములను నాచరించుట చేత, "ఎవరైతే హృదయమందు పవిత్రత గల్గియుందురో అట్టివారు ధన్యులు; వారు యీశ్వరుని చూడగల్గుదురు". ఎక్కడ గాంచుట? హృదయమందే.

చ. స.

---

# గ్రంథాలయ క్యాలండరు.

ఉచితము.

సకల యాంధ్ర గ్రంథ భాండాగార పఠనాలయములకు, స్త్రీసమాజములకు, ఆంధ్రవిద్యార్థి సంఘములకు, ఆంధ్రమహాసభలకు, భాషాభిమానులకును విన్నవించునదేమనగా బర్మాదేశమునకు రాజధాని నగరమగు రంగూన్ పుర సమీపమునందు కాండాగ్లేలో శ్రీ యాంధ్రగౌతమ గ్రంథ నిలయముచే ముద్రింపబడిన "దుర్మతి" యను ౧౯౨౧-౨౨ వ సం॥ క్యాలండరు తపాల కర్చులకు మాత్రము అణాబిళ్లలంపిన పంపబడును. అందు యాంధ్రదేశమునకు సంబంధించిన ముఖ్యపండుగలు, వ్రతములు, జయంతులు, మొదలగునవియు శ్రీ బర్మా జన ముఖ్యదైవమగు శ్రీ గౌతమ బౌద్ధుని చిత్రపటమును గలదు. ఇది ప్రతి ఆంధ్రయింటను గ్రంథ భాండాగారములోను నుండదగినది. పలయువారు యిట్లు వ్రాసికొనుడు. తప్పక బడయగలరు,

ఎమ్. సుబ్బరామయ్య,
8—53 Sparks St,
Rangoon, Burmah.

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*
*in*
**English & Telugu**
*Promptly and Neatly*
*executed.*

## యోగము.

పరోక్షము: అపరోక్షము.

ధర్మజీవనమునకు తోడ్పడు ఉత్తమ గ్రంథరాజము.

భక్తాగ్రేసరులు.

బ్రహ్మానంద కేశవచంద్రునిచే

విరచితమగు

సుప్రసిద్ధ గ్రంథమునకు

ఆంధ్రీకృతము.

వెల వీ. పీ. ఖర్చులతో 5 అణాలు.

పలయువారు:—

ధర్మసాధనీ కార్యస్థానము,

కాకినాడ.

అని వ్రాయవలయును.

## కేసరి—రత్నత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్టు కాకుండుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగానుపోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీమర్మ వ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటక, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10 0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,
ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజావూరు.

34. వాయునివారణి (పెయిన్ కిల్లర్):—లోపలికి పుచ్చుకొను ఔషధము (పెయిన్ బాం) పైపూతకు వాతముచేత కలిగెడు అన్నివిధజబ్బులకు రాజ ఔషధము. ఖరీదు డబ్బి 1కి రూ. 1, వి. పి. చార్జి 1 మొదలు 6 డబ్బీలవరకు 7 అణాలు ప్రత్యేకము.

35. కలరాకిల్లరు:—కలరాజాడ్యమునకు యీగొప్పజాడ్యము పోగొట్టుటకు గొప్ప ఔషధము. డబ్బి 1కి వెల 1 రూపాయి, 1టి మొదలు ఆరు డబ్బీలవరకు తెప్పించుకొనువెడల వి. పి. చార్జి అణాలు 7 ప్రత్యేకము.

36. మలబద్ధనివారణి:—మామూలు మలబద్ధమునకు ఇతర అజీర్ణ రోగములకు మంచి యౌషధము. ఖరీదు డబ్బా 1కి 10 అణాలు, వి. పి. చార్జి రెండు డబ్బీలవరకు 7 అణాలు ప్రత్యేకము.

37. చంద్రామృతరస్:—అన్నివిధములయిన దగ్గులు, క్షయం, ఉబ్బసములను వెంటనే గుణముచూపును. నమ్మకముగ పని చేయును. ఆకలి వృద్ధిచేయుచు బలమునిచ్చును. డబ్బి 1కి 1 రూపాయ, వి. పి. చార్జి ఆరు డబ్బీలవరకు 7 అణాలు ప్రత్యేకము.

---

### బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 7 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లోమర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, జైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బొబ్బలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేరు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదరాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

55, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును. ప్లేగు, కలరా, ఇన్ ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును. ఇతరవ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరము పైను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

తంతి విలాసము 'పండిట్', మదరాసు.

ఎస్. మాధవస్వామిన్ (ఆయుర్వేదాచార్య)
డి. దేశికాచార్యులు,
జాయింటు ప్రొప్రయిటర్లు.


# ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


**V. P.** *Rs.* *As.*



**To M. R. Ry.**

61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry